క్లుప్తంగా

కొత్త రేషన్‌కార్డులు పంపిణీ



కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఆదివారం మండలంలోని మేదపల్లి గ్రామంలో నాయకులు పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు శంకర్‌పాటిల్, మాజీ సర్పంచ్ నరేష్‌కుమార్, నాయకులు సిద్దుపాటిల్, జాను, శ్రీకాంత్, బండప్ప, జగదీశ్వర్, పాషపాటిల్, గాళయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోగప్పకు సన్మానం



జోగప్పను సన్మానించిన లక్ష్మీనారాయణ

కంది(సంగారెడ్డి): రాష్ట్ర గజిటెడ్ ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా జోగప్ప ఎంపికయ్యారు. కంది మండలం ఎద్దుమైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా జోగప్ప పని చేస్తున్నారు. ఇన్‌చార్జి ఎంఈఓగా కూడా కొనసాగుతున్నారు. ఇంటర్నేషనల్ లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ డాక్టర్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా సన్మానం జరిగినట్లు తెలిపారు.

రాజశేఖర్‌కు సన్మానం

వట్‌పల్లి(అందోల్): లయన్స్ క్లబ్ 320డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులను గవర్నర్ అమర్‌నాథ్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమంలో భాగంగా అందోల్ మండలంలోని చింతకుంట పాఠశాల ఉపాధ్యాయుడు చందా రాజశేఖర్‌ను సన్మానించారు.

నూతన బస్టాండ్ ప్రారంభం



బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న రాములు, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): నూతన బస్టాండ్ ఏర్పాటుతో ప్రయాణికుల సమస్యకు పరిష్కారం లభించిందని రిటైర్డ్ హెచ్‌ఎం రాములు అన్నారు. జిన్నారం పట్టణ పరిధిలోని కొడకంచిలో పంచాయతీ నిధులతో నిర్మించిన నూతన బస్టాండ్‌ను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం బస్సుల్లో ప్రయాణించే ప్రజలు బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్థానిక నాయకుల చొరవతో సమస్యను పరిష్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బడ్డే కృష్ణ, మాజీ సర్పంచ్ శివరాజ్, మాజీ ఉపసర్పంచ్ అభిలాష్ గౌడ్, గ్రామపెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



స్మశాన వాటికను పరిశీలిస్తున్న మోహిద్ పటేల్

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని ముస్లిం స్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు మోహిద్ పటేల్ కోరారు. ఆదివారం స్మశాన వాటికలోని పరిస్థితులను పరిశీలించారు. స్మశాన వాటిక చెట్లను కొట్టివేసి సమాధులపై ఇష్టమొచ్చినట్లు పారేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా స్మశాన వాటికలో పిచ్చిమొక్కలు పెరిగి పోయాయని తెలిపారు. సబ్‌కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ స్పందించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట స్థానిక నాయకులు అహ్మద్, కుద్దూస్, మంసూర్, ఇమ్రాన్ ఉన్నారు.

నేటి నుంచి షాబుద్దీన్ దర్గా ఉత్సవాలు

జహీరాబాద్: మండలంలోని శేఖాపూర్‌లోని హజరత్ షేక్ షాబుద్దీన్ దర్గా ఉత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం నుంచి జాతర ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా పక్కనే ఉన్న కర్ణాటక నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకుంటారు. జాతర ఏర్పాట్లను డీఎస్పీ సైదా పరిశీలించారు.

విస్తారంగా వర్షాలు

- జలకళ సంతరించుకున్న ప్రాజెక్టులు
- మత్తడిదూకుతున్న చెరువులు, వాగులు, వంకలు
- పెరిగిన భూగర్భజలాలు



కళకళలాడుతున్న చినిగెపల్లి ప్రాజెక్టు

> ఆగస్టులో విస్తారంగా వర్షాలు కురవడంతో మండలంలోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. వాగులు, వంకలు, చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయి. భూగర్భ జలాలు కూడా పెరిగాయి.

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆగస్టు నెలలో ఎడతెరిపి లేని వర్షాలకు జలాశయాలు నిండాయి. మండలంలోని డప్పూర్, హద్నూర్, గంగ్వార్ చెరువులు నిండుకొని అలుగు దూకుతున్నాయి. చెక్‌డ్యాంలు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. డప్పూర్ చెరువు గత 6ఏళ్ల తర్వాత అలుగు దూకుతుంది. చెరువు కింద ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. చినిగెపల్లి ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున నీరు చేరడంతో అది అలుగు పారుతుంది. గంగ్వార్, హద్నూర్ చెరువులు కూడా కొన్ని ఏళ్ల తర్వాత అలుగు పారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. ఫలితంగా భూగర్భజలాలు పెరిగి నీరు పైకి ఉబికి వస్తుంది.

వర్షపాతం ఇలా...

మండలంలో సాధారణానికి మించి వర్షపాతం నమోదు అయింది. జూన్‌లో 119ఎంఎం పడాల్సిన ఉండగా 53.1ఎంఎం కురిసింది. జూలై నెలలో సాధారణ వర్షం 178.9ఎంఎం కురవాల్సి ఉండగా 265.4ఎంఎం కురిసింది. ఆగస్టులో 169.6ఎంఎం కురవాల్సి ఉండగా 327.4ఎంఎం కురిసింది. జూన్‌లో 56శాతం లోటు వర్షపాతం ఉండగా జూలై 88శాతం, ఆగస్టు మాసంలో 93శాతం అధిక వర్షపాతం నమోదైంది. మూడు నెలల్లో 468మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 645.9మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. 177.9మిల్లీ మీటర్ల వర్షం అధికంగా కురిసింది. అధిక వర్షపాతం నమోదు కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

9 ఏళ్ల తర్వాత నిండుచెరువు



తొమ్మిదేళ్ల తర్వాత భారీ వర్షాలు కురవడంతో డప్పూర్ చెరువు నిండి అలుగు పారుతోంది. చెరువు నిండుకోవడంతో భూగర్భ జలాలు కూడా బాగా పెరిగాయి. పంటలు కొంత దెబ్బతిన్నప్పటికీ నీటి సమస్య దూరం తీరింది.

–ఓంకార్, వడ్డి గ్రామం

స్క్రాప్ దుకాణాలు తీసేయండి

జహీరాబాద్ టౌన్: కాలుష్యానికి కారణమవుతున్న స్క్రాప్ దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని జాగో తెలంగాణ వ్యవస్థాపకులు రాములు నేత మున్సిపల్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన స్క్రాప్ దుకాణాల వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. పరిశ్రమల నుంచి సేకరించి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాల్చివేస్తున్నారని, దీంతో వాయువు కాలుష్యం వ్యాప్తి చెంది ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. స్క్రాప్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వాపోయారు.

లక్డారంలో రక్తదాన శిబిరం

పటాన్‌చెరు: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్డారంలో ఆదివారం తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 36 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో నవభారత్ నిర్మాణ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్, మాజీ ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, కండర క్షీణిత వ్యాధి బాధితుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్, రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రరెడ్డి, వేంకటేశ్వరస్వామి ఆలయం చైర్మన్ గోపాల్‌రెడ్డి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సన్మానం

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో సోమవారం ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ మారుతి రాథోడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు.

సీసీ కెమెరాలతో మరింత భద్రత

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: భద్రతను పెంచడంలో కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపకరిస్తాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని న్యూసాయి భగవాన్ కాలనీలో రూ. 2 లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేరాల నియంత్రణతో పాటు నేరగాళ్లను గుర్తించటంలో సీసీ కెమెరాలు పోలీసుశాఖకు కీలకంగా ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రతీకాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో నిరంతర నిఘాకు ఆస్కారం ఉంటుందన్నారు. ప్రధాన కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కాలనీ ప్రజల కోసం అతిత్వరలో మినీ ఫంక్షన్ హాల్, పార్కును అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీఐ నరేష్, సీనియర్ నాయకుడు మల్లేశ్, బాలారాజు, ప్రమోద్ రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కృష్ణ, జగదీశ్, దాసు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూలిన ఇళ్లకు పరిహారం

మునిపల్లి(అందోల్): ఇటీవల భారీ వర్షాల కారణంగా మండలంలోని ఆయా గ్రామాల్లో కూలిన 8 ఇళ్లకు పరిహారం మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తహసీల్దార్ గంగాభవాని ఆదివారం తెలిపారు. 8మంది లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

సంకీర్తనలకు సంకల్పమే ప్రధానం

హరేకృష్ణ టెంపుల్ ప్రతినిధి విభీషణ్ ప్రభు



భజనలు చేస్తున్న భక్తులు

జహీరాబాద్: సంకీర్తన లాంటి భగవత్ సంబంధిత కార్యక్రమాలు నిర్వహించాలంటే సంకల్పం కావాలని జిల్లా హరేకృష్ణ టెంపుల్ ప్రతినిధి విభీషణ్ ప్రభు అన్నారు. ఆదివారం పట్టణంలోని హనుమాన్ మందిరంలో 171వ నగర సంకీర్తన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. హరేకృష్ణ మహామంత్ర జపం, ప్రభుపాదుల వారి ప్రార్థన, కృష్ణ కీర్తనలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సత్సంగ్ సమావేశంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ఎలాంటి అవరోధాలు లేకుండా గత 170 వారాల పాటు నిర్విరామంగా సంకీర్తన నిర్వహిస్తూ యువతలో ఆధ్యాత్మిక స్ఫూర్తి కలిగించడంలో కృతకృతులయ్యారన్నారు. ఈ సందర్భంగా భగవత్‌గీతలోని సాంఖ్య యోగంలోని శ్లోకాలను ఉదహరిస్తూ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నర్సింహ హారతితో కార్యక్రమం ముగిసింది. అనంతరం రాచన్నపేటలోని గణేశ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రసాద వితరణ నిర్వహించారు.

వీరభద్రుడి ఆలయం మూసివేత



ఆలయ ద్వారాన్ని మూసివేస్తున్న అర్చకులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణ పరిధిలోని వీరన్నగూడెం శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా అర్చకులు ఆదివారం మూసేశారు. సోమవారం ఉదయం తిరిగి సంప్రోక్షణ అనంతరం దేవాలయాన్ని తిరిగి తెరవనున్నట్లు అర్చకులు, ఆలయ ఈఓ శశిధర్ గుప్తా తెలిపారు. ఆలయం మూసేయడంతో పరిసర ప్రాంతాలు భక్తులు లేక నిర్మానుష్యంగా మారాయి. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సోమయ్య, అర్చకులు శివానాగులు, శ్రవణ్ కుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బోరంచ ఆలయం మూసివేత

నారాయణఖేడ్: సంపూర్ణ చంద్రగ్రహణం ఆదివారం రాత్రి నుంచి ప్రారంభం కానుండడంతో మనూరు మండలంలోని సుప్రసిద్ధ బోరంచ నల్లపోచమ్మ ఆలయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ మల్లయ్య ఆధ్వర్యంలో పురోహితులు మూసేశారు. ఖేడ్ డివిజన్‌లోని అన్ని ఆలయాలను మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరవనున్నట్లు పురోహితులు తెలిపారు.

గణేశ్‌గడ్డ దేవస్థానం మూసివేత

పటాన్‌చెరు టౌన్: చంద్రగ్రహణం నేపథ్యంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం గణేషగడ్డ దేవస్థానం, డివిజన్ పరిధిలోని ఉమామహేశ్వర దేవస్థానం, రామలింగేశ్వర దేవస్థానం, మహంకాళి ఆలయం, మహాదేవుడి ఆలయం అర్చకులు ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు.

పంచవటిక్షేత్రంలో భక్తుల సందడి



అభిషేకాలు చేస్తున్న దంపతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామ శివారులోని పంచవటి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం క్షేత్రంలో వెలసిన శారదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టశక్తి పీఠాలకు అభిషేకాలు నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి, నాగయ్య స్వామి ఆధ్వర్యంలో 80 మంది వేద పాఠశాల విద్యార్థులు, దంపతులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధి కన్సాన్‌పల్లి గ్రామంలో ఆదివారం వీరహనుమాన్ ఆలయ 7వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గణపతిపూజ, అభిషేకం, కుంకుమార్చన అలంకరణ కార్యక్రమాలు పురోహితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య జరిపించారు. ఈ ఉత్సవాల్లో గ్రామస్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలయ్య, మాజీ సర్పంచ్ వెంకటేశం, మాజీ ఉప సర్పంచ్ ఎం.క్రిష్ణ, మాజీ వార్డు సభ్యుడు గజేందర్‌రెడ్డి, కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

నారాయణఖేడ్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సోమవారం నిజాంపేట్ మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉ.11.30గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సంగ్రాం తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నాయకులు హాజరై సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు.

న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో సోమవారం రాజకీయ పార్టీల నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్నికలకు సంబంధించి రూపొందించిన ఓటరు జాబితాల్లో అభ్యంతరాలు, ఇతర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

మునిపల్లి(అందోల్): ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరినందన్ రావు తెలిపారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలియజేయడం కోసం సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న శుక్లవర్ధన్‌రెడ్డి

జహీరాబాద్: క్రీడాకారులు వాలీబాల్ టోర్నమెంట్‌లో క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి శుక్లవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శేఖాపూర్‌లో హజరత్ షేక్ షాబుద్దీన్ మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజం అన్నారు. నియోజకవర్గ స్థాయి టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, ఉర్సు కమిటీ అధ్యక్షుడు చష్మోద్దీన్, సభ్యులు మహబూబ్‌ఖాన్, లతీఫ్‌బీ అజిమొద్దీన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

భారీ ధర పలికిన గణనాథుడి లడ్డూ

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పట్టణ పరిధిలోని పాత హనుమాన్ ఆలయ సమీపంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన గణనాథుని నిమజ్జన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వేలంపాటలో ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి రూ.15 లక్షల లడ్డూను సొంతం చేసుకున్నారు. విశేష పూజలు అందుకున్న గణపతి కరెన్సీ మాలను స్థానికులు ఆదికేశవరెడ్డి రూ. 6 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గణనాథుని నిమజ్జన ప్రక్రియను పురవీధుల్లో ఘనంగా నిర్వహించి స్థానిక చెరువు వద్ద పూజలు చేసి నిమజ్జనం చేశారు. స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.